
సాక్షి ఒడిశా

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,10,980లు, బంగారం 350 మిల్లీగ్రాములు , వెండి 10 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాయి స్వాధీనం

రెండు చోట్ల మూడు క్వింటాళ్లకు పైబడి గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఇవి దొరికాయి. - 2లో.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
మంగళ	బుధ
6.08	4.18

న్యూస్‌రీల్‌

గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యం



యువకుని మృతదేహం

రాయగడ: స్థానిక కొత్త బస్టాండు సమీపంలో గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని గుర్తించామని పోలీసులు తెలిపారు. సిమెంటు రంగు చొక్కా ధరించిన ఉన్న యువకుని వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని అంచనా వేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

ట్రక్కు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ట్రక్కు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ వద్ద సోమవారం మధ్యాహ్నం ట్రక్కు దగ్ధమైంది. కొట్‌పాడ్ కళాశాల సమీప పెట్రోల్ బంక్‌కు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ట్రక్కును 63 జాతీయ రహదారిలో గల పెట్రోల్ బంక్ వద్ద డ్రైవర్ పార్కింగ్ చేసి స్టౌవ్‌పై వంట చేసుకుంటుండగా ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. వాహనదారులు ఈ విషయాన్ని కొట్‌పాడ్ అగ్నిమాపక అధికారులకు తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే ట్రక్కు సగభాగం కాలిపోయింది. ట్రక్కులో 15 కేజీల గ్యాస్ ట్యాంకర్‌ను గుర్తించారు. ట్రక్కు కలప తీసుకువెళ్లేందుకు కొట్‌పాడ్ వచ్చినట్లు తెలిసింది. తాను క్యాబిన్‌లో వంట చేస్తున్న సమయంలో ట్రక్కు ఇంజిన్ వద్ద షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వచ్చాయని స్వల్ప గాయాలతో బయట పడిన ట్రక్కు డ్రైవర్ వెల్లడించారు. తాను వెంటనే ట్రక్కు నుంచి బయటకు వచ్చేశానని వెల్లడించాడు. ఈ ట్రక్కు నవరంగపూర్ జిల్లా ఝోరిగాం ప్రాంతానికి చెందిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. విషయం తెలిసిన కొట్‌పాడ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసవ ‘వేదన’

మల్కన్‌గిరి :

మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభీమాన్ ఏరియా దూలిపూట్ పంచాయతీ అనిబిరిడి గ్రామానికి చెందిన శ్యామ్ దురువ భార్య అప్పలం దురువ సోమవారం ప్రసవ వేదన అనుభవించింది. పురుటి నొప్పులు రావడంతో ఆమె సోమవారం ఉదయం స్థానిక ఆశ వర్కర్‌ను సంప్రదించగా ఆమె వచ్చి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. అయితే ఆ గ్రామానికి నెట్‌వర్క్ సదుపాయం లేక పోవడంతో కొండపైకి ఎక్కి అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. కానీ వాహనం ఆ గ్రామానికి రావడానికి దారి లేదు. దీంతో గర్భిణిని డోలీపై ఉంచి నాలుగు కిలోమీటర్ల పాటు మోసుకెళ్లారు.



అంబులెన్స్ వద్దకు చేరిన దృశ్యం

మధ్యలో వాగు దాటాక పురుటి నొప్పులు అధికమయ్యాయి. ఎట్టకేలకు వాహనం వద్దకు చేరుకోగా వెంటనే జాన్‌బాయి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి చిత్రకొండ తీసుకెళ్లాలని చెప్పగా.. అక్కడకు వెళ్లారు. అక్కడ వైద్యులు సిజేరియన్ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అబ్బాయి జన్మించాడు.



డోలీలో గర్భిణిని తీసుకెళ్తున్న దృశ్యం



డోలీతో వాగు దాటుతున్న దృశ్యం

పులుల చర్మాలు స్వాధీనం

- ఆరుగురు నిందితులు అరెస్ట్
- త్వరలోనే అంతర్ రాష్ట్ర ముఠాను పట్టుకుంటాం
- డీఎఫ్‌ఓ సుబ్మహ్మణ్యం ఆనంద్



పట్టుపడిన వన్యమృగాల చర్మాల వేటగాళ్లు, స్వాధీనం చేసుకున్న పులి చర్మాలు

డీఎఫ్‌ఓ ఆనంద్

పర్లాకిమిడి: గజపతి జిల్లా చంద్రగిరి రేంజ్‌లో గత కొంతకాలంగా అంతర్ రాష్ట్ర ముఠా ఆధ్వర్యంలో జరుగుతున్న పులి చర్మాలు, వన్యమృగాల రవాణాను పోలుసులు గట్టురట్టు చేశారు. అటవీ అధికారులు సోమవారం ఆరుగుర్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు పులి చర్మాలు, ఒక చిరుత పులి చర్మం, ఒక పులికూన చర్మం, 26.1 కిలోల పంగోలిన్ చర్మ పోలుసులును, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి గజపతి జిల్లా మండళసాయికి చెందిన ఆరుగుర్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు డీఎఫ్‌ఓ సుబ్మహ్మణ్యం ఆనంద్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నిందితుల వెనక ఇంకా చాలామంది వేటగాళ్లు ఉన్నట్టు, వారు తప్పించుకున్నట్టు అటవీ అధికారి అనుమానిస్తున్నారు. తొలిత చంద్రగిరి రేంజ్ అటవీ ప్రాంతం మండళసాయి గ్రామంలో కొందరు పులిచర్మాలు అక్రమంగా స్మగ్లింగ్ చేస్తున్న సమాచారం అందుకుని అటవీ రేంజ్ అధికారులు రెక్కీ నిర్వహించారు. అనంతరం నిందితులను పట్టుకుని పులిచర్మాలు, వన్యప్రాణుల చర్మాలు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎక్కడ అమ్ముతున్నారు, నిందితులు పేర్లు, తదితర వివరాలు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. వీరికి సహకరిస్తున్న అంతర్ రాష్ట్ర గ్యాంగ్‌ను త్వరలోనే పట్టుకుంటామని డీఎఫ్‌ఓ తెలియజేశారు. రాష్ట్రంలో 2019–2024లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (క్రైం బ్రాంచ్) 59 చిరుత పులుల చర్మాలు పట్టుకున్నారు.

‘జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలి’



ఉత్కళ సంపాదక సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస రావుని అభినందిస్తున్న దృశ్యం



సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో పాటు జిల్లా జర్నలిస్టులు

జయపురం: ఉత్కళ సంపాదక సంఘం 1945 నుంచి రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతోందని సంఘ రాష్ట్ర అధ్యక్షులు భిభుత భూషణ రథ్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఒక హొటల్ సభా గృహంలో కొరాపుట్ జిల్లా శాఖ నిర్వహించిన బంధుమిలన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అక్రిడేషన్ కమిటీని ఏర్పాటు చేయలేదని, అందుకే జర్నలిస్టులకు అక్రిడేషన్ లభించడం లేదని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాయని, ఇక్కడ కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బేణుధర పండ జర్నలిస్టుల భూమిక, సురక్ష, వారి స్థితిగతులపై ప్రసంగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రదీప్ బక్షీ, కొరాపుట్ జిల్లా అధ్యక్షులు నృశింహ బ్రహ్మ, సీనియర్ పాత్రికేయులు, జిల్లా పరామర్శదాత వి.భాస్కర రావు, రాష్ట్ర సంఘ పరామర్శ దాత బినోద్ మహాపాత్రో, మల్కన్‌గిరి అధ్యక్షుడు దుర్యోధన పాత్రో, రాయగడ జిల్లా అధ్యక్షుడు సురేష్ దాస్, నవరంగపూర్ జిల్లా అధ్యక్షుడు హృషికేష్ మిశ్ర, రాష్ట్ర సంఘ మాజీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మొదలగు వారు ప్రసంగించారు. అనంతరం సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, నృశించ బ్రహ్మను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జయసింగ్ పాడొసెట్టి, కోశాధిపతిగా సుదర్శన్ సేనాపతి, సలహాదారునిగా వి.భాస్కర రావు, బినోద్ మహాపాత్రోలు, బ్లాక్ కోఆర్డినేటర్ గా చిత్తరంజన్ చౌధురి, బొరిగుమ్మ సమితి కోఆర్డినేటర్‌గా సుదర్శన్ ప్రధాన్, కొట్‌పాడ్ కు భవానీ ప్రసాద్ పాఢీ, కుంద్రకు హరీష్ చంద్ర బెహర, బొయిపరిగుడ కోఆర్డినేటర్‌గా శివనారాయణ మహంతి, సెమిలిగుడ రూపేష్ ఖొర, పొట్టంగి కృష్ణ చంద్ర గొలారి లను కోఆర్డినేటర్లుగా నియమించారు.

ఐదు రాష్ట్రాల బంద్‌కు మావోల పిలుపు

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బ్యూరో అధికార ప్రతినిధి ప్రతాప్ పేరుతో లేఖ విడుదల
- కూంబింగ్ ఉధృతం చేస్తామన్న ఎస్పీ నితీష్

మల్కన్‌గిరి :

మల్కన్‌గిరి జిల్లా సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బ్యూరో అధికార ప్రతినిధి ప్రతాప్ సోమవారం ఓ లేఖను విడుదల చేశారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు 50 మంది మావోయిస్టులను పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తున్నారని, వీరిలో చాలా మంది గిరిజనులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో ఈ నెల 15న బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో 15 రోజుల్లో వరుసగా 22 మంది అమరులయ్యారని, వారి త్యాగాలను గుర్తించాలని కోరారు. జల్, జంగిల్, జమీన్ సిద్ధాంతాల కోసమే పోరాటం సాగుతోందని వివరించారు. ఈ విషయపై మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాద్వనీని వివరణ కోరగా.. మావోల లేఖ చూసి బంద్ పాటించాల్సిన అవసరం లేదన్నారు. అధికారులతో సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉధృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల తనిఖీ



పెద్ద బజార్, గౌడ వీధి కందిపప్పు ఫోర్‌మిల్లుపై దాడులు చేస్తున్న బీఎంసీ పాలన యంత్రాంగం అధికారులు

బరంపురం : నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై ఆది, సోమవారాల్లో బరంపురం మున్సిపాలిటీ కార్పొరేషన్ (బిఎంసి) అధికారులు వరుసగా దాడులు చేశారు. స్థానిక హరడాఖండి జంక్షన్ లో గల ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై, వాటర్ బాటిళ్లు, కందిపప్పు మిల్లులపై దాడులు చేసి లైసెన్సు లు లేని వారికి రూ.74వేలు జరిమానా విధించారు.

క్లుప్తంగా

పేకాట శిబిరంపై దాడి

జయపురం: జయపురం దాశరథి సాహిలో జూదం శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారివద్ద రూ.4,930 స్వాధీనం చేసుకున్నారు. వారికి నోటీసులు ఇచ్చి విడిచి పెట్టారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



చైతన్య రథం పైనుంచి ప్రచారం చేస్తున్న చావ్ పట్నాయక్, భృగుబక్షి పాత్రో

బరంపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తోంది. దీంతో బరంపురం నియోజకవర్గంలో అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. బరంపురం శాసనసభ నియోజకవర్గంలో బీజేడీ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రమేష్ చంద్రచావ్ పట్నాయక్, ఎంపీ అభ్యర్థి భృగుబక్షి పాత్రోలు వారి మద్దతుదారులతో ఆదివారం, సోమవారం జోరుగా ప్రచారం నిర్వహించి తమను గెలిపించాలని ఓటర్లను కోరారు.

నెక్కంటికి అభినందనలు



నెక్కంటిని అభినందిస్తున్న అనసూయా మాఝి

రాయగడ: బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నెక్కంటి భాస్కరరావుకు రాయగడ శాసన సభ నుంచి బీజేడీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న అనసూయా మాఝి, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘునాథ్ గొమాంగొ సోమవారం అభినందించారు. రాణిగుడ ఫారంలో గల నెక్కంటి నివాసానికి వెళ్లి సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాయగడ రాజకీయాల్లో చొటుచేసుకున్న తాజా పరిణామాల దృష్ట్యా అధిష్టానం నెక్కంటికి బీజేడీ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అభ్యర్థులు ఆయనను కలిసి అభినందించడంతోపాటు ఎన్నికల్లో విజయం కోసం మంతనాలు చేస్తున్నారు.

పలువురు బీజేడీలో చేరిక



బీజేడీలో చేరిన కార్యకర్తలతో నాయకులు

కొరాపుట్: భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు బీజూ జనతాదళ్ పార్టీలో చేరారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జంక్షన్ సమీపంలో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం చేరికల కార్యక్రమం జరిగింది. నందాహండి సమితి మెంట్రి గ్రామ పంచాయతీ నాయక్ సర్పంచ్ (ఉప సర్పంచ్) రస్మితా సాహుతోపాటు మరో 50 కుటుంబాలు బీజేడీలో చేరారు. వీరికి నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, నబరంగ్పూర్ అసెంబ్లీ బీజేడీ అభ్యర్థిని కౌసల్య ప్రదాని పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మెంట్రి గ్రామం విపక్ష బీజేపీ నబరంగ్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి గౌరీ మజ్జి గ్రామం కావడంతో వీరి చేరికకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఎన్నికల్లో పోటీకి దిలీప్‌కు మార్గం సుగమం

భువనేశ్వర్: బొగ్గు కుంభకోణం కేసులో కేంద్ర మాజీ మంత్రి దిలీప్ రేకు ట్రయల్ కోర్టు విధించిన శిక్షపై ఢిల్లీ హై కోర్టు సోమవారం స్టే విధించింది. బొగ్గు కుంభకోణం కేసులో ట్రయల్ కోర్టు తనకు విధించిన శిక్షపై స్టే విధించాలని కోరుతూ దిలీప్ రే వేసిన పిటిషన్‌పై హై కోర్టు గతంలో తన తీర్పును రిజర్వ్ చేసింది. 1999లో జార్ఖండ్ బ్లాక్ కేటాయింపులో అవకతవకల కేసులో దిలీప్ రేకు మూడేళ్ల జైలు శిక్ష పడింది. 2020 అక్టోబరు 26న ట్రయల్ కోర్టు దిలీప్ రేకు 3 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. 71 ఏళ్ల దిలీప్ రే అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో బొగ్గు శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో తాను పోటీ చేయాలనుకుంటున్నాని, ప్రజలకు సేవ చేసేందుకు ఇదే తనకు చివరి అవకాశం అని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అభ్యర్థనను సీబీఐ తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. ఆయన శిక్షపై స్టే ఇవ్వవద్దని న్యాయ స్థానానికి వివరించారు. వాదోపవాదాలు విన్న ఉన్నత న్యాయ స్థానం 71 ఏళ్ల దిలీప్ రే సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని మధ్యంతర ఉత్తర్వులతో ఊరట కల్పించింది.

'న్యాయ సహాయం కోరే ఖైదీల వివరాలు తెలుసుకోండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయ సహాయం కావాలనుకునే జైలు ఖైదీలను గుర్తించి వివరాలు సేకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యలయంలో పారాలీగల్ వలంటీర్లతో ఒరియెంటేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జైలులో ముద్దాయిలు, ఎవరైనా బెయిల్ వచ్చినా షూరిటీ పెట్టుకునే పరిస్థితి లేక జైల్లో మగ్గుతున్న వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. అలాంటి వారి వివరాలు సేకరించి సాయం చేయాలన్నారు.

మూడు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం



పికప్ వ్యాన్‌లో మూడు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్న బరంపురం ఎక్సైజ్ అధికారులు

బరంపురం : బరంపురం నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 3 క్వింటాళ్ల 9 కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని వ్యాన్ సీజ్ చేశారు. ఐఐసీ అధికారి గీతాంజలి సాహు అందించిన సమాచారం ప్రకారం.. సోమవారం ఉదయం కొందమాల్ జిల్లా, దరింగబడి నుంచి బరంపురం నగరానికి ఫికప్ వ్యాన్‌లో అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా ఎక్సైజ్ విభాగం వారు నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధి కుకుడాఖండి జంక్షన్‌లో తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ వాహనంలో 3 క్వింటాళ్ల 9 కిలోల గంజాయి బయటపడింది. వ్యాన్ డ్రైవర్ తప్పించుకున్నాడు. ఈ గంజాయి విలువ రూ.38 లక్షలు ఉంటుందని ఐఐసీ తెలిపారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితుడు

108 కిలోల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లా ఎక్సైజ్ పోలీసులు సోమవా రం ఉదయం గోవిందపల్లి వద్ద బొలేరో వాహ నంలో అక్రమంగా తరలిస్తున్న 108 కిలోల గంజాయిని పట్టుకున్నారు. మల్కన్‌గిరి ఎక్సైజ్ ఎస్ఐ బింబార్ పండా ఆదేశాల మేరకు మత్తిలి ఎక్సైజ్ స్టేషన్ అధికారి ప్రభాకర్ శెట్టి తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా బొలేరా వాహాన్ని ఆపి తనిఖీ చేశారు. 108 కిలోల గంజాయి దొరకడంతో వాహనంలో ఉన్న వ్యక్తికి అదుపులోకి తీసుకుని విచారించారు. బోడదురాల్ గ్రామానికి చేందిన జయరాం హంతాల్‌గా గుర్తించారు. ఈ గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.పూజారి అనే కానిస్టేబుల్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న భవనం నాల్గో అంతస్తు ఎక్కి కిందకు దూకబోయాడు. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి కాపాడారు.

పెట్రోల్ దొంగల హల్‌చల్

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో పెట్రోల్ దొంగలు హల్‌చల్ చేయడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలో కొన్ని వీధుల్లో ఇళ్ల ముంగిట పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగతనం చేయడమే కాకుండా వాహనాల వస్తువులు చో రీ చేశారు. దీంతో వాహనదారులంతా భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం ఇదే మాదిరిగా పెట్రోల్ దొంగతనాలు చేసిన దొంగలు కొంత కాలం స్తబ్ధతగా ఉంటూ మరో సారి రెచ్చిపోయారు.

ఆ పావురం ఎక్కడిది..?

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లాలో ఆదివారం ఓ పావురం స్థానికులకు చిక్కింది. దీని కాళ్లకు అనుమానాస్పదంగా చిప్‌లు అమర్చి ఉన్నట్లు గుర్తించారు. దీని కదలికపై సర్వత్రా పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. గత ఏడాది మార్చిలో పారాదీప్‌లో చేపల పడవపై వాలిన సందిగ్ధ పావురం మత్స్యకారులకు చిక్కింది. అప్పట్లో దీన్ని గూఢచర్యం కోసం ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం. ఢెంకనాల్ జిల్లా షడంగి అటవీ రేంజ్ పరిధిలోని లౌనాడి గ్రామంలోని ఒకరి ఇంటి ముంగిట వాలి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో చిక్కింది. ఆదివారం సాయంత్రం గ్రామంలో ఉరుములతో కూడిన వర్షం పడడంతో పావురం బలమైన గాలికి ఎగరలేక గ్రామస్తులకు చిక్కింది. పావురం కాళ్లకు అనుమానాస్పదంగా ఏదో కట్టి ఉన్నట్లు గుర్తించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దాని కాళ్లకు చిప్స్ వేలాడుతున్నట్లు కనుగొన్నారు. పోలీసులు గ్రామానికి వెళ్లి పావురాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. షడంగి అటవీ రేంజ్‌కు చెందిన అధికారుల బృందం గ్రామానికి చేరుకోవడంతో పోలీసులు పావురాన్ని వారికి అప్పగించారు. పావురం కాళ్లకు మైక్రోచిప్‌లను అమర్చి గూఢచర్యం కోసం ఉపయోగించవచ్చని వారు అనుమానిస్తున్నారు. భారతీయ భాషలో లేని కారణంగా చిప్స్‌పై ఏమి రాసి ఉందో అర్థం చేసుకోలేకపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ చిప్‌లను భువనేశ్వర్‌లోని తమ కార్యాలయానికి పంపిస్తామని, చిప్‌లను ల్యాబొరేటరీలో పరిశీలించిన తర్వాత వాటి ఉద్దేశం తెలుస్తుందని చెప్పారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల కవాతు



నబరంగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల కవాతు



సిమిలి గుడలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

కొరాపుట్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు కవాతు చేశారు. సోమవారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మార్చింగ్ చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి చేతిలో లాఠీ ఊపుతూ కవాతు చేస్తుంటే పలు కూడళ్ల వద్ద వారిపై పూల వాన కురిపించారు. ఏటా ఉగాది ముందు ఇలా కవాతు చేయడం వీరి ఆనవాయితీ.

చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో నుంచి బుడ్డెపు నీలాద్రి మృతదేహాన్ని వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది

కంచిలి: మఠం కంచిలిలో గల మఠం చెరువులో జెన్నాగాయి గ్రామానికి చెందిన బుడ్డెపు నీలాద్రి (42) అనే వ్యక్తి చెరువులో మునిగి చనిపోయారు. నీలాద్రి సోమవారం తన భార్యతో కలిసి కంచిలిలో కూలి పనికి వచ్చారు. మధ్యాహ్నం స్నానం చేస్తానని చెరువులో దిగాడు. కొద్దిసేపటికి ఊపిరాడక నీళ్లు తాగి మృతి చెందాడు. మృతునికి భార్య జానకి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సోంపేట అగ్నిమాపక శకటం సిబ్బంది వాహనంతో వచ్చి చెరువులో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే నీలాద్రి మృతి చెందాడని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన ఈ వ్యక్తి మృతి చెందడంతో భార్య, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ డి.భాస్కరరావు, సిబ్బంది ఆర్.సింహాచలం, వై.ఈశ్వరరావు, కేవీ రమణ, బి.బాబూరావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య జానకి ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక సర్పంచ్ గణప సింహాచలం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ఎండ తీవ్రతకు వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని బూరగాం పంచాయతీ పరిధిలోని మాదినవాణి పేట గ్రామానికి చెందిన నక్క లచ్చయ్య(77) అనే వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. లచ్చయ్య తన ఇంటి నుంచి సోమవారం ఉదయం 10 గంటల సమయంలో తన వ్యక్తిగత పనుల కోసం బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం స్థానికుల సలహా మేరకు రెవెన్యూ అధికారికి సమాచారం అందించారు. అయితే వీఆర్‌ఓ మల్లేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకునే లోపే అంత్యక్రియలు నిర్వహించారు.

ఆస్పత్రుల్లో వినూత్న ప్రయోగం



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీవీలను చూస్తూ, సూచనలు వింటున్న గర్భిణులు

టెక్కలి రూరల్: ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నూతనంగా టీవీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నూతనంగా 3 టీవీలను గర్భిణుల చెకప్ వార్డు ముందు, డెలివరీ రూమ్‌లోనూ, ఆపరేషన్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరిండెంటెంట్ బొడ్డేపల్లి సూర్యారావు తెలిపారు. ఈ టీవీల ద్వారా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. అంతే కాకుండా బాలింతలు తమ పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా నిపుణులతో వీడియోలు చేయించి ఇక్కడ ప్రదర్శిస్తారు. వారికి ఏదైనా సమస్య వస్తే ఎలా గుర్తించాలి, డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి అన్నదానిపై ఆ తల్లులకు టీవీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ టీవీల ద్వారా వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

చాలా ఉపయోగపడుతుంది..



ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ టీవీల ద్వారా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల నుంచి వీడియోలు ప్రదర్శిస్తున్నాం. పిల్లలకు ప్రధానంగా వచ్చే సమస్యల గురించి ఏ విధంగా తెలుసుకోవాలో అవగాహన కల్పించడం జరుగుతుంది.

– బి.సూర్యారావు, టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరిండెంటెంట్

'తండేల్' సాంకేతిక బృందం సందర్శన



తండేల్ సినిమా దర్శకుడు చందు మొండేటికి బొకే అందజేస్తున్న కొత్తమత్స్యలేశం యువకుడు

ఎచ్చెర్ల క్యాంపస్: నాగచైతన్య, సాయి పల్లవి నటిస్తున్న 'తండేల్' సినిమా సాంకేతిక బృందం సోమవారం కొత్తమత్స్యలేశం గ్రామాన్ని సందర్శించింది. గతంలోనూ పలుమార్లు వీరు వచ్చారు. స్థానికంగా లొకేషన్లు పరిశీలించారు. ఈ నెల చివరిలో పది రోజుల పాటు ఇక్కడే నివాసం ఉండి షూటింగ్ చేయనున్నట్లు తెలిపారు.

'మా సినిమాలో హీరో శ్రీకాకుళం మత్స్యకారుడే'

అరసవల్లి: పాకిస్తాన్ సైన్యానికి చిక్కిన శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుడి తెగువ, ధైర్యసాహసాలు, స్థానిక జీవన విధానంపైనే తమ 'తండేల్' సినిమా రూపుదిద్దుకుంటోందని ప్రముఖ సినీ దర్శకుడు చందు మొండేటి అన్నారు. సోమవారం ఉదయం ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అంతరాలయంలో ప్రత్యేకంగా స్వామికి ప్రత్యేక పూజలతో మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలం కొత్త దిబ్బల పాలెం మత్స్యకారుడు రామారావు వాస్తవిక కథను, పాకిస్తాన్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, నాగచైతన్య, సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ చిత్రం త్వరలో విడుదల కానుందని వెల్లడించారు. 'తండేల్' నాగ్‌చైతన్య కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోనుందన్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీకాకుళం యాసలోనే తెరకెక్కిస్తున్నామని, సినిమా త్వరలోనే రిలీజ్ కానుందని వివరించారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం'

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అనారోగ్యంతో ఇటీవల మరణించిన కొత్తూరు పీఎస్ హెడ్ కానిస్టేబుల్ సవర అనప, గార పీఎస్ కానిస్టేబుల్ బురా సురేష్ కుటుంబాలకు అండగా ఉంటామని జీఆర్ రాధిక అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వీరి కుటుంబాలకు ఎస్పీ చేతుల మీదుగా నగదు చెక్‌లను అందజేశారు. రాష్ట్ర డీజీపీ శాఖాపరంగా మంజూరు చేసిన విడోఫండ్ రూ. 50 వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ. 25 వేలు చెక్కులను సవర అనప, బురా సురేష్ భార్యలు లక్ష్మి, పద్మావతిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇరువురి మరణం చాలా బాధాకరమని, జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని, శాఖాపరంగా రావాల్సిన మిగిలిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఏఆర్ డీఎస్పీ ఎల్ శేషాద్రినాయుడు, పరిపాలనాధికారి సీహెచ్ గోపీనాథ్ పాల్గొన్నారు.

ముగ్గురు అర్చకులకు జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలు

అరసవల్లి: క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వ దినం సందర్భంగా జిల్లా స్థాయిలో ముగ్గురిని ఉత్తమ అర్చకులుగా ఎంపిక చేశామని జిల్లా దేవదాయ శాఖాధికారి బీఆర్‌వీవీ ప్రసాద్‌పట్నాయక్ తెలియజేసారు. శ్రీనివాసాచార్యులు (శ్రీకాకుళం–శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయం, దూదివారికోవెల), సీహెచ్ జగన్నాథాచార్యులు (పాతపట్నం–శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం), ఇప్పిలి సూర్యనారాయణ మూర్తి (కళ్లేపల్లి–శ్రీమణి నాగేశ్వరస్వామి వారి ఆలయం)లకు జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలను జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నామని ప్రకటించారు. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు వీరికి చెరో రూ.10,116 నగదుతో పాటు వస్త్రాలు, ప్రశంసా పత్రం అందజేస్తామని తెలియజేశారు.

అరసవల్లి ఆదిత్యాలయంలో..

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. అలాగే ఉత్తమ అర్చకులుగా ఇప్పిలి కాశ్యపశర్మ, ఇప్పిలి ఫణీంద్రశర్మ, వేద పారాయణదారుడు ధర్భముళ్ల శ్రీనివాస శర్మలకు ఈ ఏడాదికి ఉగాది పురస్కారాలను అందజేస్తున్నామని ప్రకటించారు. వీరికి రూ.10,116 నగదు, ప్రశంసాపత్రాలను అందజేస్తామని వెల్లడించారు. అలాగే మంగళవారం ఉదయం, సాయంత్రం కూడా ఉగాది పంచాంగ పఠనం అనివెట్టి మండపంలో నిర్వహించనున్నట్లుగా ప్రకటించారు.

ఉత్సాహంగా వంటల పోటీలు



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తేజస్వీ మైదానంలో వివిధ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన వంటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ పిండి వంటకాల తయారీ పోటీల్లో 60 మంది మహిళలు, కొంతమంది పురుషులు కూడా పాల్గొని ప్రతిభ కనబర్చారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ న్యాయవాది ప్రణతి పాత్రో, సత్యలు వ్యవహరించారు. ఆసక్తికరంగా రెండు గంటల పాటు కొనసాగిన పోటీల్లో విజేతల వివరాలను ప్రకటించారు. జి.అనురాధ, కె.సుధ మొదటి రెండు స్థానాల్లో నిలవగా.. తృతీయ బహుమతులను కె.ఆశ, రజితాకుమారీ గెలుచుకున్నారు. విజేతలకు ఉగాది రోజైన మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి కుముంధాన్, పి.లోకేష్, బార్జి ప్రసాదరావు, సంఘం నాయుడు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల కోసం సన్నాహాలు



తెలుగు సంప్రదాయ చీర కట్టులో కోలాటంలో శిక్షణ తీసుకుంటున్న జేసీఐ మహిళలు

బరంపురం: ఉగాది వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు బరంపురం తెలుగు మహిళాలు సన్నాహాలు చేశారు. ఏటా నిర్వహించే విధంగానే మంగళవారం కూడా స్థానిక ఖప్పా వీధిలోని సబుద్ధిపేట కల్యాణ మండపం ప్రాంగణంలో జేసీఐ బరంపురం లేడీస్ నిర్వహించే కార్యక్రమాల కోసం రెండు రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉగాది రోజున ప్రదర్శించేందుకు జేసీఐ మహిళలు 'షడ్రుచులు' నాటికను రిహార్సల్ చేశారు. రోక్ స్టార్ డాన్స్ ఇనిస్టిట్యూట్‌లో తెలుగు వారి సంప్రదాయ సాంస్కృతిక ఆధునిక నృత్యలపై కొరియోగ్రాఫర్ తరుణ్ దగ్గర శిక్షణ తీసుకున్నారు.

ఇచ్ఛాపురానికి మరో రైలు సేవలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో మరో రైలు బ్రహ్మపురం–ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. 06087/ 06088 నంబర్ గల 22 సెకండ్ క్లాస్ బోగీలతో కూడిన బ్రహ్మపురం–ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆగింది. ఈ రైలు బ్రహ్మపురంలో మధ్యాహ్నం 12.40కు బయల్దేరి ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ నుంచి విజయవాడ గూడురు మీదుగా తమిళనాడులోనికి అక్కడి నుంచి ఎర్నాకులం చేరుకుంటుందని స్థానిక రైల్వేస్టేషన్ అధికారులు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

● కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు చేపట్టి 24 గంటల్లో దాన్ని పరిష్కరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా మండల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా హాజరయ్యారు. ఎన్నికలకు సంబంధించి ఆర్‌ఓలు, నోడల్ అధికారులు చేపడుతున్న పనులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారు లు, సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా వారు పని చేస్తున్న కేంద్రాన్ని విడిచి వెళ్లరాదన్నారు. నిబంధనలు మీరిన అధికారులపై వేటు తప్పదన్నా రు. పోలింగ్, కౌంటింగ్‌కి సంబంధించి నిర్దేశించిన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉత్ప న్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది వారికి అప్పగించిన బాధ్యతలను అప్రమత్తంగా నిర్వహించాలన్నారు.

48 గంటలు దాటినా కొన్ని శాఖలు రోజు వారీ ఎన్నికల నివేదికలు అందజేయడం లేదని, 13వ తేదీలో గా పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలు పంపాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఇంకా 18 రకాల స్టేషనరీ ఎన్నికల సంఘం నుంచి రావాల్సి ఉందని, వాటిని త్వరగా తెప్పించాలని సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. పోలింగ్ రోజున 450 వాహనాలు సిద్ధం చేయాలని, అవి కాకుండా అదనంగా 104 టాటా మ్యాజిక్ వాహనాలు సిద్ధం చేయాలని రవాణా నోడల్ అధికారికి సూచించారు. అన్ని చెక్ పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ కచ్చితంగా ఉండాలన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకూ మాత్రమేనని, మొత్తం ప్రక్రియను వీడియో గ్రఫీ చేయాలని, డీఎస్పీ స్థాయి అధికారి బందోబస్తు నిర్వహించాలని చెప్పారు.

క్లుప్తంగా

కాస్త చల్లబడిన వాతావరణం

పార్వతీపురం: గత నాలుగు రోజులు నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. వాతావరణం సోమవారం కాస్త చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో 35 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఉపశమనం పొందారు. మరో రెండు రోజుల పాటు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో అధికార యంత్రాంగం చలివేంద్రాలను ఏర్పాటుచేసింది. బాటసారులకు మజ్జిగ, నీటిని సరఫరా చేస్తోంది.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

బొండపల్లి: మండలం మీదుగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. గజపతినగరం మండలం నుంచి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి పట్టుకుని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

180 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పోలీసులు ధ్వంసం చేస్తున్న బెల్లం ఊట

బొండపల్లి: సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 180 లీటర్ల బెల్లం ఊటను సోమవారం సాయంత్రం ధ్వంసం చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని కొండవాని పాలెం గ్రామ శివారు మామిడితోటలో సారా తయారీ కోసం డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లంఊటపై అందిన సమాచారం మేరకు వెళ్లి ధ్వంసం చేసినట్లు చెప్పారు.

31 మద్యం బాటిల్స్ స్వాధీనం

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టు వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ, పాంచాలి గ్రామానికి చెందిన పి.కోటేశ్వరరావు నుంచి 31 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

గజపతినగరం రూరల్: మండలంలోని కొణిశ గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్లను దాడిచేసి పట్టుకున్నట్లు గజపతినగరం ఎస్సై మహేష్ తెలిపా రు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి, వారి నుంచి రూ.10,150లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి


జామి: మండలంలోని శిరికిపాలెం గ్రామంలో సోమవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు.స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారంతో జామి ఎస్సై వీరబాబు సిబ్బందితో కలిసి ఈశిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.5,700 నగదు, మూడు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వెండి వస్తువులు స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక కన్యకపరమేశ్వరి ఆలయం నుంచి గంటస్తంభం మధ్య ప్రాంతంలో ఒక వ్యక్తి నుంచి 14 కిలోల 405 గ్రాముల వెండి వస్తువులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.విశాఖలోని గాజువాకకు చెందిన అర్జున్ కుమార్ మాలి విజయనగరంలోని బంగారు షాపులకు వెండి వస్తువులను సరఫరా చేస్తుంటాడు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా రూ.9 లక్షల 30వేల 375 విలువైన 14 కిలోల 405 గ్రాముల వెండి వస్తువులను ఎస్సై నరేష్ కుమార్ గుర్తించారు. ఆ వస్తువులకు సంబంధించి ఎటువంటి రశీదులు లేకపోవడంతో కేసు నమోదు చేసి, వెండి వస్తువులను సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి పంపించారు.

చెరకు రైతుకు సర్కారు సాయం

- అండగా నిలిచిన సంకిలి ఈఐడీ ప్యారీస్
- మూడు జిల్లాల్లో 18,100 ఎకరాల్లోని చెరకు సేకరణ
- లక్ష్యం మేర చెరకు గానుగ పూర్తి
- ప్రభుత్వం చొరవతో రైతుకు ఆదాయం



కర్మాగారానికి తరలించేందుకు చెరకును నరుకుతున్న రైతులు

రేగిడి: గతంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సంకిలి ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారం ఒక్కటే ఆ జిల్లాలోని చెరకు రైతులకు బాసటగా ఉండేది. గత ప్రభుత్వాలు చెరకుసాగుపై దృష్టిసారించలేదు. దీని ఫలితంగా రేగిడి, పాలకొండ, రాజాం, వీరఘట్టం, ఆమదాలవలస తదితర ప్రాంతాల చెరకు రైతులు మాత్రమే సంకిలి ఈఐడీ ప్యారీస్ సుగర్ ఫ్యాక్టరీ ద్వారా లబ్ధిపొందేవారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని భీమసింగి, బొబ్బిలి పరిధిలోని లచ్చయ్యపేట పరిధిలో సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో అక్కడి రైతులు ఇక్కడి ఫ్యాక్టరీకి చెరకును తీసుకురాలేక చాలా అవస్థలు పడేవారు. ఇక్కడి నుంచి చెరకు కటింగ్ ఆర్డర్లు అక్కడి రైతులకు వచ్చేవి కాదు.

ఫలించిన ప్రభుత్వం చొరవ

జిల్లాల విభజన అనంతరం సంకిలి ప్యారీస్ సుగర్స్ ఫ్యాక్టరీ విజయనగం జిల్లా పరిధిలోకి వచ్చింది. అంతేకాకుండా చెరకు రైతును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కర్మాగారం యాజమాన్యంతో మాట్లాడి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని చెరకు రైతుల వద్ద చెరకును తీసుకునేలా ఒప్పించింది. దీంతో ఈ కర్మాగారం పరిధిలో తగ్గుతూ వచ్చిన చెరకు సాగు లక్ష్యం పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4 లక్షల మెట్రిక్ టన్నుల చెరకును క్రషింగ్ లక్ష్యంగా ఫ్యాక్టరీ చేసుకుంది. 2023 సెప్టెంబర్‌లో ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించి 2024 మార్చి 25వతేదీ వరకూ చేసింది. గతంలో ఒక్క శ్రీకాకుళం జిల్లా పరిధిలో 8 వేల ఎకరాల వరకూ మాత్రమే చెరకు సేకరణ జరిగేది. ఈ ఏడాది ఈ మూడు జిల్లాల్లో మొత్తం 19,800 ఎకరాల్లో చెరకును రైతులు సాగు చేస్తుండగా, భీమసింగి, బొబ్బిలి, సంకిలి జోన్‌ల పరిధిలో 18,100 ఎకరాల మేర చెరకును ఫ్యాక్టరీ కొనుగోలు చేసి ప్రభుత్వం చొరవతో మూడు జిల్లాలోని చెరకు రైతులకు అండగా నిలిచింది.

జోన్ల వారీగా సేకరించిన చెరకు వివరాలు

- ఎస్‌సీఎస్ పరిధిలో : 9,709 మెట్రిక్ టన్నులు
- భీమసింగి పరిధిలో : 6,632 మెట్రిక్ టన్నులు
- సంకిలి పరిధిలో : 3,92,750 మెట్రిక్ టన్నులు
- మొత్తం : 4,09,091 మెట్రిక్ టన్నులు

కర్మాగారం పరిధిలో ఐదేళ్లలో మద్దతుధర ఇలా..

సంవత్సరం	- మద్దతు ధర (రూపాయల్లో)
2018-2019	- 2,750
2019-2020	- 2,750
2020-2021	- 2,800
2021-2022	- 2,900
2022-2023	- 2,980
2023-2024	- 3,080

ఐదేళ్లుగా చెరకు మద్దతు ధర ఇలా..

చెరకు రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఐదేళ్లుగా నిలుస్తోంది. ప్రతి ఏడాది రైతు సంఘాలతో చర్చలు జరిపి మద్దతు ధర ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా గతేడాది కూడా రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి మద్దతు ధర ప్రకటించింది.



సంకిలి సమీపంలో చెరకు పంట

లక్ష్యాన్ని దాటి క్రషింగ్



ప్యారీస్ కర్మాగారం చెరకు రైతును ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ సేకరించిన చెరకుకు సంబంధించి సకాలంలో రైతులకు చెల్లింపులు జరిపింది. గతేడాది మూడుజిల్లాల పరిధిలో మొత్తం 9500 మంది రైతులు లబ్ధిపొందారు. రైతు బాగుండాలి, కర్మాగారం బాగుండాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నాం. మమ్మల్ని నమ్మి చెరకు సాగు చేస్తున్న రైతుకు నష్టం లేకుండా చూస్తున్నాం. చెరకు కర్మాగారానికి సరఫరా చేసిన 14 రోజుల్లోనే నేరుగా రైతు ఖాతాలోకే నగదు జమ చేస్తున్నాం. మా కర్మాగారంతో పాటు భీమసింగి, బొబ్బిలి ఎస్‌సీఎస్ ఫ్యాక్టరీ జోన్‌ల పరిధిలో గల పక్క జిల్లాల రైతులు కూడా మా కర్మాగారానికే చెరకు సరఫరా చేశారు. మొత్తం 18,100 ఎకరాల్లోని చెరకును సేకరించి 4 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి చేశాం. వచ్చే సీజన్‌లో 19 వేల ఎకరాలకు పైగా చెరకును క్రషింగ్ చేయడం లక్ష్యంగా చేసుకున్నాం.

– వి. పట్టాభిరామిరెడ్డి, సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం, సంకిలి, రేగిడి మండలం

ముస్లిం మైనారిటీల పక్షపాతి సీఎం జగన్



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ముస్లిం, మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ మోహన్ రెడ్డి అని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘంలోని 12వ వార్డు గంటా వారి వీధిలో సోమవారం సాయంత్రం ముస్లిం సోదరుల మధ్య ఘనంగా జరిగిన రంజాన్ ఈద్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఎంతో పవిత్రంగా కొలిచే ఖురాన్ గ్రంథం స్వర్గం నుంచి భూమికి ఈ రంజాన్ మాసంలోనే వచ్చిందని ముస్లిం సోదర సోదరీమణులంతా ఎంతో పవిత్రంగా ఈ మాసాన్ని భావిస్తారన్నారు. తనను ఎంతో ఆదరించి అభిమానించే ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ మీరంతా బాగుండాలని, అల్లా కరుణ మీపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఆరేళ్లు మీ అందరికీ నా సొంత ఖర్చులతో రంజాన్ తోఫా ఇస్తున్నాని ఈ ఏడాది కూడా ఆడపడుచులందరికీ అందించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా ఇవ్వలేకపోతున్నానన్నారు. తప్పకుండా మిమ్మల్ని భవిష్యత్‌లో గౌరవించుకుంటానని మహిళలందరికీ తెలియజేశారు. నియోజకవర్గంలో 800 ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, మీరంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పార్టీ సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, కౌన్సిలర్‌లు తాడ్డి అరుణ, కో ఆప్షన్ సభ్యులు షేక్ గౌసియా బేగం, కో ఆప్షన్ ఎంపీటీసీ బాషా, ముస్లిం సోదరులు షఫీ, జలాల్, మత పెద్దలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తాడ్డి శంకరావు, నియోజకవర్గ స్థాయి ముస్లిం ప్రజానీకం తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం



దత్తిరాజేరు: పట్టాలపై పడి ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉంది. మృతురాలు విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న రైలు ప్రయాణికురాలు ప్రమాదవశాత్తు జారిపడి కానీ, రైలు పట్టాలు దాటుతున్న ఎవరైనా మహిళ కానీ అయి రైలు ఢీకొని అయినా మృతి చెంది ఉండవచ్చని రైల్వే కానిస్టేబుల్ ఈశ్వర రావు తెలిపారు. మృతురాలి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండొచ్చని, చేతిపైన హిందీలో పచ్చ బొట్టు రాతలు ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచామని, ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్సై ఫోన్ నంబర్ 9490617089కు, లేదా కానిస్టేబుల్ ఈశ్వరరావు ఫోన్ 9491813163 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గాయపడ్డ వృద్ధుడి మృతి



బొండపల్లి: చికిత్స పొందుతూ మృతి చెందిన కామరాజు

బొండపల్లి: ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు మండలంలోని గొట్లాం గ్రామ సమీపంలో జారి పడి గాయాల పాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కుమరయ్యిగారి కామరాజు(73) గత నెల 31 వతేదీన తన కుమారుడు సత్యనారాయణతో కలిసి బంధువుల ఇంట శుభకార్యానికి బొండపల్లి వచ్చి తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా గొట్లాం వద్ద ఆటోలో నుంచి జారిపడిపోవడంతో చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గాయపడిన కామరాజును జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

తోటపల్లి కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం



ఎడమకాలువ వద్ద లభించిన మృతదేహం

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభించిందని ఎస్సై వై.అమ్మాన్ రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు మాసిన గడ్డం, తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్న సుమారు 50నుంచి 55 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి మృతదేహం లభించిందన్నారు. మృతునికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా ఫోన్ 9121109469. 9505681057 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ మాజీ ఉపసర్పంచ్ మృతి



మాజీ ఉపసర్పంచ్ బంగారయ్య (ఫైల్)

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి మాజీ ఉపసర్పంచ్ కంబాల బంగారయ్య చికిత్స పొందుతూ విశాఖ కేజీహెచ్‌లో మృతిచెందారు. ఇందుకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మార్చి 16న కొండగంగుబూడి పంచాయతీ చిట్టివానిపాలెంలో చింతచెట్టు ఎక్కి బొట్టలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు ఆయన కాలు జారి పడిపోయారు. దీంతో కుటుంబసభ్యులు విశాఖ ఆస్పత్రికి తరలించగా 22 రోజులు మృత్యువుతో పోరాడి ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ తెలిపారు. మృతుడికి భార్య ఎర్రయ్యమ్మ, కుమారులు పెంటయ్య, అర్జున్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

గంట్యాడ: మండలంలోని నరవ ఏఎంజీ కాలనీకి చెందిన యువకుడు అజయ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన పెదిరెడ్ల మోసే కత్తితో దాడి చేశాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి మోసే ఇంటికి అజయ్‌కుమార్ వెళ్లి నా తల్లిని ఎందుకు తిట్టావని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో కొబ్బరి బొండాల కత్తితో అజయ్‌కుమార్‌పై మోసే దాడి చేశాడు. ఆ సమయంలో అజయ్‌కుమార్ చేయి అడ్డం పెట్టడంతో చేతిపైన, మెడపైన గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు బాధితుడిని విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

857 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక పద్మావతి నగర్-ధర్మపురి మధ్య ఒక ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను వన్‌టౌన్ ఎస్సై నవీన్ పడాల్ సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలికి చెందిన కనకల గోవింద ఆటోలో 18 బస్తాల పీడీఎస్ రైస్‌ను విజయనగరం నుంచి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.32, 566లు ఉంటాయని ఆ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ డీటీ వద్దకు పంపించి కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

బొబ్బిలి: పట్టణంలోని బలిజిపేట రోడ్ వద్ద అలజంగి గ్రామానికి చెందిన యాండ్రాపు శ్రీనివాసరావు 70 మద్యం సీసాలను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే చర్చి సెంటర్ వద్ద గొల్లపల్లికి చెందిన భోగాది సత్యనారాయణ దగ్గర 47 మద్యం సీసాలు, ప్రసాద్ నగర్ కాలనీ వద్ద మండలంలోని కోమటిపల్లికి చెందిన రౌతు సింహాచలం దగ్గర 30 బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎం.నాగేశ్వర రావు ఆదేశాలతో ఎస్సై జి లోవరాజు, ఏఎస్సై జి భాస్కర రావు తమ సిబ్బందితో నిర్వహించిన ఈ దాడుల్లో మొత్తం 147 మద్యం సీసాలు, నిందితులకు చెందిన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఆరికతోటలో దొంగలు పడ్డారు

రామభద్రపురం: మండలంలోని గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడి బంగారం, నగదు, కొత్తరేగ శివాలయంలో ఉన్న హుండీ చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరికతోట గ్రామంలోని ఎస్సీ వీధికి చెందిన ఉపాధ్యాయుడు యజ్జల హరిబాబు ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న తులంన్నర బంగారం, కొంత మేర నగదు దోచుకుపోయారు. ఇంటిలోని ముందుభాగంలో రాంబాబు తల్లిదండ్రులు నిద్రపోగా ఆయన బెండ్ రూంలో నిద్రపోతున్నారు. ఇంటి హాల్‌లో ఉన్న బీరువాలోని బంగారం,నగదు చోరీ చేశారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ సిబ్బందితో పాటు క్లూస్‌టీంతో కలిసి సోమవారం వెళ్లి పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. అనంతరం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కొత్తరేగ గ్రామంలోని శివాలయంలో దొంగలు చొరబడి హుండీ ఎత్తుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

తనిఖీ బృందాల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

- అరగంటలో కేసు నమోదుకు ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ, తహసీల్దార్లు

విజయనగరం అర్బన్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన సంఘటనలపై అరగంటలో కేసు నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తనిఖీ బృందాలను ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకూడదన్నారు. వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులతో కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌ఎస్‌టీల పనితీరును సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి సుమారు 22 రోజులు గడిచిపోయినా, క్షేత్రస్థాయిలో యంత్రాంగం చురుగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫిర్యాదు అందితేనే స్పందిస్తున్నారు తప్ప, తమంతట తాము పట్టుకున్న కేసులు దాదాపు లేవని అన్నారు. ఫిర్యాదు వస్తేగానీ స్పందించరా? అంటూ నిఘా వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఒక్కకేసు కూడా నమోదు చేయని బృందాలను నిలదీశారు. నిర్లిప్తత విడిచిపెట్టాలని, పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పుడు కేసులు వద్దు

ఎఫ్‌ఎస్‌టీలకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇస్తామని, అప్పటికీ కేసులు నమోదు చేయకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయ పార్టీల సమావేశాల్లో తాగునీరు, మజ్జిగ మినహా, ఇంకా ఏది పంచినా, భోజనాలు, పెట్టినా కోడ్ ఉల్లంఘన కిందే వస్తుందన్నారు. అనధికారికంగా జరుగుతున్న కొనుగోళ్లపైనా దృష్టి సారించాలని, అలాగని ఎవరిపైనైనా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ జిల్లాలో నగదు సీజ్ చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. ఇతర వాహనాలతోపాటు, బస్సులను కూడా విస్తృతంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎఫ్ఎస్‌టీ బృందాల సభ్యులంతా తనిఖీలకు హాజరు కావాలని కోరారు. అనవసరంగా ఎవరినీ వేధించవద్దని తప్పుడు కేసులు పెట్టవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, సీపీఓ పి.బాలాజీ, ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణకుమారి, ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ఆరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తి పెంచేందుకు చర్యలు

- డీఎంహెచ్‌ఓ డా.బగాది జగన్నాథ రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: సమాజంలో మగ, ఆడ శిశువుల నిష్పత్తి సమానంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం జిల్లా స్థాయి సలహా కమిటి చైర్మన్ డా.బగాది జగన్నాథ రావు తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మగ, ఆడ శిశువుల నిష్పత్తి ప్రస్తుతం ప్రతి వేయి మందికి 943 మంది ఉన్నారని, 5 సంవత్సరాల లోపు పిల్లల్లో ఈ నిష్పత్తి ఇంకా తక్కువగా ఉందని దీనిని అరికట్టేందుకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం కింద గర్భం ధరించడానికి ముందుగాని తర్వాత గాని లింగ ఎంపికను నేరంగా పరిగణించనున్నట్లు హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ఎవరూ వెళ్లవద్దని ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని కోరారు. మనమంతా కలిసికట్టుగా లింగ వివక్షకు చరమగీతం పాడదామని, ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు.

లింగ నిర్ధారణ సమాచారంపై ఫిర్యాదు

లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావం చేయించిన సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్‌లైన్ (గ్రీవెన్స్ పీసీపీఎన్‌డీటీ.ఏపీ.జీఓవీ.ఇన్) ద్వారా తెలియజేయవచ్చని డీఎంహెచ్‌ఓ చెప్పారు. కమిటీ సభ్యులు వారి సలహాలను అందిస్తూ ఆడపిల్లలు, మగపిల్లలు సమానమేనని ఈ విషయంపై సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా చర్యలు తీసుకోవాలని, మెడికల్ షాపుల్లో అబార్షన్లకు ఉపయోగించే మందుల అమ్మకం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఆ మందుల అమ్మకాలపై పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

అవగాహన కల్పించాలి

అక్రమంగా అబార్షన్లు చేసే ఆర్ఎంపీ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లల భవిష్యత్తుకు అనేక పథకాలు ఉన్నాయని, వాటి ద్వారా ఆడపిల్లల చదువు, వివాహం కోసం ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవచ్చని తెలిపారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు గృహ సందర్శన, తదితర విధాలుగా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యాన్ని తెలియజేసి, ఆర్థిక ప్రణాళిక పథకం గురించి ప్రచారం చేయాలని కోరారు. నూతన వధూవరులు, గర్భవతులు, అత్తమామలకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డా. ఎం.వినోద్ కుమార్, డా.సీహెచ్. కమలకుమారి, ఐఎంఏ ప్రెసిడెంట్ డా.వివేక్, సామాజిక కార్యకర్త బీఎస్‌బీరావు, డా.ఎం.నారాయణ, డా.పి.శ్రీధర్ పాల్గొన్నారు.


తప్పిన ప్రమాదం



తాటిచెట్టు పడడంతో ధ్వంసమైన టాటా మ్యాజిక్ వాహనం ముందు భాగం

గుర్ల: మండలంలోని గుజ్జింగివలస సమీపంలో సోమవారం పెనుప్రమాదం తప్పింది. విజయనగరం నుంచి చీపురుపల్లికి ప్రయాణికులతో వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనంపై సోమవారం తాటి చెట్టు పడడంతో వాహనం ముందు భాగం మొత్తం ధ్వంసమైంది. అయితే అదృష్టవశాత్తు ఈప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టాటా మ్యాజిక్ వాహనం మధ్య భాగంలో తాటి చెట్టు పడి ఉంటే చాలా మంది ప్రాణాలు పోయేవని ప్రయాణికులు అంటున్నారు. ఈదురు గాలులు లేకుండా తాటి చెట్టు పడడంతో ప్రయాణికులు ఒక్కసారిగా గందరగోళానికి గురయ్యారు.


నిఘా పెంచండి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికలు సందర్భంగా అక్రమ నగదు లావాదేవీలు, రవాణా జరగకుండా నిఘా పెంచాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజన్ మేనేజ్‌మెంట్ సిస్టం) నోడల్ ఆఫీసర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. నగదు, మద్యం, వివిధ రకాల పరికరాలు, వస్తువులు, వస్త్రాలు, ఆభరణాల అక్రమ రవాణాపై ప్రత్యేకదృష్టి సారించి సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.17.84 లక్షల నగదు, 29,148 లీటర్ల మద్యం, రూ.29.35 లక్షల విలువైన డ్రగ్స్, రూ.10.38 లక్షల విలువైన లోహపరికరాలు, రూ.31.01 లక్షల విలువైన వివిధ రకాల వస్తు సామగ్రి కలిపి మొత్తం సుమారుగా రూ.1,17,32,501 విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేయాలని, నిఘాను విస్తృతం చేయాలని ఆదేశించారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది కూడా అప్రమత్తం కావాలన్నారు. మద్యం విక్రయాలు, అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. మద్యం విక్రయాలు పెరిగినచోట కారణాలను ఆరా తీయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ క్రియాశీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. భారీ నగదు లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖాధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక, జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, నోడల్ ఆఫీసర్లు ఏఎస్పీ అస్మాఫర్హీన్, సీపీఓ పి.బాలాజీ, ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణకుమారి, జెడ్పీ సీఈఓ కె.శ్రీధర్‌రాజా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌తో ఉపాధి



ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌ను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఫొటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ (పీఐసీ) మార్కెట్ విలువ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఈసీఈ విభాగం ఐఈఈఈ విద్యార్థి విభాగంతో కలిసి 'ఫొటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పీఐసీ మార్కెట్ విలువ 2022-32 సంవత్సర మధ్యకాలంలో 21.5 శాతం పెరగనుందని, ఈ మేరకు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వీసీ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్‌ను ఘనంగా సత్కరించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.నళిని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ కేసీబీరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.గురునాథ్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ టి.ఎస్.మూర్తి, డాక్టర్ ఎం.హేమ, తదితరులు పాల్గొన్నారు.